క్లుప్తంగా

పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని నాల్గవ వార్డులో మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీకి బుధవారం రాత్రి మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేశారు. సాక్షిలో ఈనెల 10న నాల్గవ వార్డులో నీటి సమస్య అనే కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. పైపులైన్‌కు మరమ్మతులు చేయించి, నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నాల్గవ వార్డు కౌన్సిలర్ ఎరుకల యాదగిరి మాట్లాడుతూ.. తమ వార్డులో నీటి సమస్యను పరిష్కరించారని వివరిస్తూ సాక్షికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

స్కూల్ సేఫ్టీపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బెటాలియన్

వెల్దుర్తి(తూప్రాన్): హైదరాబాద్‌లోని పదవ బెటాలియన్ జాతీయ విపత్తు నివారణ దళం ఆధ్వర్యంలో మండలంలోని కుకునూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. గురువారం ఈ సందర్భంగా భూకంపాలు, అగ్నిప్రమాదాలు, వరదలు నుంచి ఎలాంటి రక్షణ చేపట్టాలి అని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో పలు అంశాలను వివరించారు. రక్షణకు వెళ్లే సమయంలో తమ వెంట ఏ వస్తువులు తీసుకెళ్లాలో, ప్రమాదంలో గాయపడినప్పుడు ప్రథమ చికిత్స ఎలా చేయాలనే విషయాలను ఎస్‌ఐలు గౌతం కుమార్, గౌరవ్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సీతారాం పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య

నర్సాపూర్: రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు తమ కోర్టులో ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ సిరి సౌజన్య తెలిపారు. గురువారం కోర్టు హాల్‌లో లోక్ అదాలత్ నిర్వహణపై పలు శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీ చేయదగ్గ పోలీసు కేసులు, చిన్న చిన్న భూ వివాదాలు ఇతరత్రా కేసుల్లో ఇరు వర్గాల కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవాలని ఆమె హితవు పలికారు. సమావేశంలో పోలీసు సీఐ జాన్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ పద్మ తదితరులు పాల్గొన్నారు.

దత్త పారాయణం



గురుచరిత్ర పారాయణం చేస్తున్న భక్తులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామ దత్తాత్రేయ దేవాలయంలో భక్తులు నిత్యం గురుచరిత్ర పారాయణం చేశారు. మార్గశిరమాసం సందర్భంగా ఏటా పక్షం రోజుల పాటు నియమనిష్ఠలతో దత్త పారాయణం చేసి, దత్త జయంతి రోజు ప్రత్యేక పూజలు చేస్తామని భక్తులు తెలిపారు.

'ఈ పాస్' తో విత్తనాలు విక్రయించండి

చిన్నశంకరంపేట(మెదక్): ఈ పాస్ విధానం ద్వారా ఎరువులను, విత్తనాలను విక్రయించాలని నార్సింగి వ్యవసాయాధికారి యాదగిరి సూచించారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ అండ్ సీడ్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతులకు సరిపడ ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు తమ ఆధార్‌కార్డును తీసుకువచ్చి ఈ పాస్ విధానం ద్వారానే కొనుగోలు చేసి రశీదు పొందాలని సూచించారు. ఫర్టిలైజ్ అండ్ సీడ్స్ దుకాణదారులు నాణ్యతతో కూడిన విత్తనాలను అందించాలని సూచించారు.

ఆశాభావంతో ఆడితేనే గెలుపు

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: పోటీల్లో గెలవాలన్న ఆశాభావంతో ఆడితే గెలుపు దక్కుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన మండల స్థాయి సీఎం కప్ ఆటల పోటీల ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ... పోటీల్లో రెండో స్థానం పొందిన క్రీడాకారులు నిరుత్సాహ పడొద్దని, మరోసారి జరిగే పోటీల్లో గెలువాలన్న ఆశాభావంతో ప్రాక్టీస్ చేస్తే విజయం మీ సొంతమవుతుందన్నారు. యువత మొబైల్ ఫోన్‌లను ఎక్కువగా వాడొద్దని సూచించారు. చదువుతో పాటు ఇంటి పనులు చేసుకోవాలని, ఆటలు ఆడాలన్నారు. ఆటలతో ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి మాట్లాడుతూ.. ఆటలు ఆడితే పోటీ తట్టుకునే శక్తి అలవాటు వస్తుందని, జీవితంలో ఎలాంటి సమస్య ఎదురైనా తట్టుకొని నిలబడగలిగే శక్తి మీ సొంతమవుతుందన్నారు. చిన్న చిన్న సమస్యలకు కుంగిపోవద్దని, వాటిని ఎదుర్కొని నిలబడాలన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధులత, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు, మేనేజర్ మధుసూదన్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, ఎంఈఓ తారాసింగ్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు శేకర్, మల్లేశ్, సత్యంగౌడ్, బాల్‌రెడ్డి, ప్రసాద్, మహ్మద్, విఠల్, శివకుమార్, రషీద్, ఆర్‌ఐ సిద్ధిరాం రెడ్డి, పలువురు పీఈటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను అధికారులు సన్మానించారు.

గెలుపు, ఓటమి సహజం

కొడిపల్లి(నర్సాపూర్): క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని, క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం కొడిపల్లిలో సీఎం కప్ ముగింపు పోటీల్లో ఎమ్మెల్యేతో పాటు జిల్లా గ్రంథాల సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సాయిబాబా, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ బాలరాజు, హెచ్‌ఎం పద్మజ, ఆర్‌ఐ శ్రీహరి, మాజీ ఎంపీపీ రాజు, మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్, నాయకులు, పీడీలు రమేశ్, శేఖర్, పుర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



జట్టుకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

యువకులు క్రీడల్లో రాణించాలి: మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

హవేళిఘణాపూర్(మెదక్): యువకులు క్రీడలపై ఆసక్తి కనబర్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన సీఎం కప్ మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ సింధూరేణుక, ఎంఈఓ మధుమోహన్, హెచ్‌ఎం కరుణాకర్, మండలంలోని క్రీడాకారులు పాల్గొన్నారు.



హవేళిఘణాపూర్(మెదక్): బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

పాఠశాలలో నీటి సమస్య తీర్చండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాలలో నీటి సమస్య తీర్చాలని ఎమ్మెల్యే సునీతారెడ్డికి ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. కొడిపల్లి ఉన్నత పాఠశాలకు ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పద్మజ మాట్లాడుతూ.. పాఠశాలలో గత రెండు నెలలుగా మంచినీటి సమస్య ఉందన్నారు. దీంతో మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. పాఠశాలలో సుమారు నాలుగు వందల మంది విద్యార్థులు ఉన్నారని మంచినీరు సరిపోవడం లేదన్నారు. మిషన్ భగీరథ కనెక్షన్ ఉన్న సరిపోవడం లేదన్నారు. దీంతో గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నారని చెప్పారు. ఒకసారి ట్యాంకర్ నీటిని కొనుగోలు చేశామన్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు టాయిలెట్ ఇతర అవసరాలను నీళ్లు సరిపోడం లేదన్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే నీటి సమస్య తీర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు.

ఉన్నతాధికారి మన్ననలు పదోన్నతికి సోపానాలు

కలెక్టర్ రాహుల్‌రాజ్



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న జిల్లా ఖజానా శాఖ అధికారి సాయిలు

మెదక్ కలెక్టరేట్: ఉన్నతాధికారి మన్ననలు పదోన్నతికి సోపానాలుగా మారుతాయని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా ఖజానా అధికారి సాయిలు హైదరాబాద్ అసిస్టెంట్ సెక్రటరీ ఫైనాన్స్‌గా పదోన్నతిపై వెళ్తున్న సందర్భంగా గురువారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌చార్జిగా సత్య సోమేశ్వర్‌రావు

మెదక్ జిల్లా ఖజానా శాఖ అధికారి సాయిలు పదోన్నతిపై వెళ్తుండటంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి అధికారిగా సత్య సోమేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో క్రమశిక్షణ, ఉన్నతాధికారి మన్ననలు పదోన్నతికి సోపానాలుగా నిలుస్తాయని తెలిపారు. ఇదే స్ఫూర్తిగా పనిచేసి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఉచిత పశు ఫెర్టిలిటి క్యాంపు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు రేఖ

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మానెపల్లిలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గర్భకోశ నివారణ(ఫెర్టిలిటి) క్యాంపును గురువారం నిర్వహించినట్లు మండల పశు వైద్యులు రేఖ రసజ్ఞ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. గోజాతి, గీత జాతి పశువుల్లో గర్భకోశ వ్యాధులు రావడం వలన వాటికి వైద్యం నిర్వహించామన్నారు. అనంతరం వాటికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశామన్నారు. పశువుల సమస్యలపై పాడి రైతులకు అవగాహన కల్పించామన్నారు. కాంపు ద్వారా 120 పశువులకు వైద్యం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌ఓ ఫజల్, గోపాల్‌మిత్ర సూపర్‌వైజర్ సత్యనారాయణ, గోపాల మిత్రలు నవీన్, రమేశ్, భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బండ్ల ఊరేగింపు



బండ్ల ఊరేగింపులో పాల్గొన్న యువకులు

టేక్మాల్(మెదక్): మండలంలోని కాదులూరు గ్రామంలో మల్లికార్జునస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రకరకాలుగా తయారుచేసిన బండ్లను ఊరేగిస్తూ యువకులు, పెద్దలు తేడా లేకుండా నృత్యాలు చేశారు. అనంతరం మల్లికార్జునస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి, నిర్వాహకుల అందించిన తీర్థప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

మాధవానంద సరస్వతి



మాట్లాడుతున్న మాధవానంద సరస్వతిస్వామి

పాపన్నపేట(మెదక్): ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత, శుభం కలుగుతాయని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి అన్నారు. గురువారం నాగసానిపల్లిలో శ్రీ ఉమా కేదారేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాజశేఖర్‌శర్మ, శ్యాంసుందర్ శర్మ, రామశర్మ, నర్సింలు గుప్తా, ఇంద్రసేనారెడ్డి, యాబన్న, శ్రీనివాస్, రవీందర్, భుమయ్య, భూషణం, శ్రీనివాస్, మహేందర్, నాగరాజ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తపస్ ధర్మాగ్రహ దీక్ష వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుకన్య

నిజాంపేట(మెదక్): పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సుకన్య ధర్మాగ్రహ దీక్ష వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని 17న ఇందిరా పార్క్‌లో జరిగే ధర్మాగ్రహ దీక్షలో పాల్గొనేందుకు ఉపాధ్యాయులందరూ విచ్చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏ లను వెంటనే ప్రకటించాలన్నారు. మండలాధ్యక్షుడు ఉమ్లా నాయక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం మహేందర్, సంఘ నాయకులు రవీందర్‌రెడ్డి, అర్జున్, వెంకటస్వామి, ఆలీ, సుచరిత, రాణి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలంలోని కొప్పులపల్లి గ్రామానికి చెందిన గౌడి పోచయ్య(64)భార్య వజ్రమ్మలు టీవీఎస్ మోపెడ్‌పై బంధువులను బుధవారం పరామర్శించేందుకు బుధవారం నార్సింగి ఆస్పత్రికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చేగుంట శివారులోని కనకదుర్గ వైన్స్ సమీపంలో వడియారం నుంచి చేగుంట వైపుకు వస్తున్న డీసీఎం వ్యాను టీవీఎస్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోచయ్య తలకు తీవ్ర గాయాలు కాగా మేడ్చల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న పోచయ్య బుధవారం రాత్రి మృతి చెందగా, కుమారుడు సురేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రాఫ్టింగ్ పోలింగ్‌పై అవగాహన



ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

వెల్దుర్తి(తూప్రాన్): రానున్న పంచాయతీ ఎన్నికల్లో భాగంగా అధికారులు అన్ని పార్టీ నాయకులతో డ్రాఫ్టింగ్ పోలింగ్‌పై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఉమాదేవి అవగాహన కల్పించారు. పంచాయతీ ఎన్నికలపై వారికి సూచనలు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ముగిసిన క్రీడాపోటీలు



పాపన్నపేట(మెదక్): బహుమతిని అందజేస్తున్న హెచ్‌ఎం మహేశ్వర్



మనోహరాబాద్(తూప్రాన్): క్రీడాకారులతో అధికారులు

జిల్లాలోని అన్ని మండలాల్లో సీఎంకప్ పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా గురువారం ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, పుట్‌బాల్, ఇతర విభాగాల్లో జరిగిన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు.



అల్లాదుర్గంలో..



రామాయంపేటలో బహుమతులు అందిస్తున్న తహసీల్దార్ రజని, మున్సిపల్ కమిషనర్ దేవేందర్



చిలప్‌చెడ్(నర్సాపూర్): క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్, ఎంఈఓ విఠల్



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగిలో విజేతగా నిలిచిన నర్సంపల్లి పెద్దతండా క్రీడాకారులు



పెద్దశంకరంపేట(మెదక్): విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



శివ్వంపేట(నర్సాపూర్): బహుమతులు అందిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఎంఈఓ



కొల్చారం(నర్సాపూర్): విజేత జట్టుతో ఎంపీడీఓ కృష్ణవేణి,ఎంఈఓ సత్యనారాయణరావు



చిన్నశంకరంపేటలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ

సంక్షిప్త వార్తలు

◆ **ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి**



పాపన్నపేట(మెదక్): ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని రామతీర్థం మాజీ సర్పంచ్ బాబాగౌడ్ అన్నారు. గురువారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 12 ఏళ్లుగా పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఇతరులకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు.

◆ **ఢిల్లీకి వెళ్లిన బీసీ నాయకులు**

మెదక్‌జోన్: జిల్లాకు చెందిన పలువురు బీసీ నేతలు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగే బీసీ ధర్నాకు తరలివెళ్లారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు చట్టసభల్లో వాటా ఇవ్వాలని జరిగిన ఈ ధర్నాకు మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ప్రముఖ సంఘ సేవకులు రాష్ట్ర బీసీ నాయకులు గంగాధర్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు చిరంజీవి, సిద్ధిశ్వర్ ఆజాద్, స్వామి, శంభుని రాజకుమార్‌గౌడ్, నాగరాజు తదితరులు తరలివెళ్లారు.

◆ **ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడిగా రవి**



నర్సాపూర్: టీఎస్ యూటీఎఫ్ నర్సాపూర్ మండల శాఖను గురువారం ఎన్నుకున్నామని యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి పద్మారావు చెప్పారు. యూనియన్ మండలాధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, ఉపాధ్యక్షుడిగా అస్రాషాహీన్, డాకియా, కోశాధికారిగా రమేశ్‌రాజులతో పాటు ఆయా కమిటీలకు ప్రతినిధులను ఎన్నుకున్నట్లు వారు వివరించారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని మోడల్ పాఠశాలలో హిందీ భోదించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. హెచ్‌పీటీతో పాటు టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 16 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ **సమాజం హితం కోసం ముందుంటాం**

మిరుదొడ్డి(దుబ్బాక): సమాజ హితం కోసం చేసే కార్యక్రమాలకు పార్టీలకు అతీతంగా తామంతా ముందుంటామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజేశం, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి, బీజేపీ నాయకుడు మల్లేశం అన్నారు.

కాలిస్తే కాలుష్యం.. దున్నితే భూసారం

ఏఓ నరేశ్



దుబ్బాకటౌన్: మాట్లాడుతున్న ఏఓ నరేశ్

దుబ్బాకటౌన్: వరి పంట పూర్తికాగానే రైతులు కొయ్యలను కాలుస్తున్నారని దాని ద్వారా భూసారవంతం దెబ్బతింటుందని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేశ్ అన్నారు. గురువారం రాయపోల్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లిలో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వరి కొయ్యలను తగులబెట్టడం వల్ల కలిగే నష్టాల గురించి రైతులకు వివరించారు. వరి కొయ్యలను దున్నితే భూసారం పెరుగుతుందని చెప్పారు. వరి కొయ్యలను భూమిలో రోటవేటర్‌తో కలిపిదున్ని సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎకరానికి ఒక బ్యాగ్ వెయ్యడం ద్వారా వరి కొయ్యలు త్వరగా కుళ్లిపోయి భూమిలో కలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రజిత, రైతులు పాల్గొన్నారు.

పోషకాలు అందవు

తొగుట(దుబ్బాక): వరి కొయ్యలను కాలిస్తే భూమికి పోషకాలు అందవని ఏఈఓ నాగార్జున అన్నారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లిలో వేస్ట్ డీకంపోజర్ వినియోగించిన అంజాగౌడ్ పొలాన్ని ఆయన పరిశీలించారు. గడ్డిని కాలిస్తే సాగుకు ఆక్సిజన్ అందక కుళ్లిపోతుందన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264